ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన–4                                                                తేదిః 12.9.2014.

ఏడాదిలోగా ఒక కోటి ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించిన సమగ్ర వివరాలతో తెలంగాణ భూసార పటం రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సంకల్పించారు. ఎన్నికల మెనిఫెస్టోలో కూడా భూసార పరీక్షలు నిర్వహిస్తామని హామినిచ్చామని, ఆ హామిని నిలబెట్టుకుని రైతులకు అండగా వుంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. తెలంగాణలో అనేక రకాల నేలలు వున్నాయని, ఆ నేలలు ఏ పంటకు అనువైనవి? ఆ భూమిలో ఏ పోషక విలువలున్నాయి? ఆ నేలలో ఏ రకమయిన పంట వేస్తే రైతుకు ఉపయోగం? తదితర అన్ని వివరాలు సేకరించి రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు కూడా అందించాలన్నది తన లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇక్రిశాట్ సహాకారంతో తెలంగాణ భూసార పటం (తెలంగాణ సాయిల్ ఫర్టిలిటీ అట్లాస్) రూపకల్పనకు కేసిఆర్ నిర్ణయించారు.

ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ విలియం డి. దార్, గ్లోబల్ లీడర్ దిలీప్ కుమార్, డైరెక్టర్ సుహాస్ పి.వాణి శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. తెలంగాణను సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చే ఆలోచన తనకు వుందని ముఖ్యమంత్రి వారికి చెప్పారు. దేశ వ్యాప్తంగా రెండవ హరిత విప్లవానికి అడుగులు పడుతున్న క్రమంలో సాంకేతిక విజ్ఞానాన్ని అంది పుచ్చుకుని తెలంగాణ ప్రాంత రైతులకు ఉపయోగపడే వ్యవసాయ విధానం అవలంభించడం తన ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలో వివిధ రకాల నేలలు వున్నాయని, అయితే రైతులు అన్ని రకాల నేలల్లో ఒకే రకం పంటలు పండిస్తున్నారని,

దీనివల్ల ఆశించిన దిగుబడులు రావడం లేదని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే కర్ణాటక రాష్ట్రం తరహాలో తెలంగాణ భూసార పటాన్ని రూపొందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇక్రిశాట్ ఆధ్వర్యంలోనే కర్ణాటకలో భూసార పరీక్షలు జరిగాయని, వారి అనుభవాన్ని, విజ్ఞానాన్ని తెలంగాణకు కూడా వినియోగించుకుంటామని చెప్పారు. భూసార పరీక్షలు నిర్వహించే పద్ధతులను కూడా ముఖ్యమంత్రి ఇక్రిశాట్ అధికారులను అడిగారు. తెలంగాణలో భూసార పరీక్షలు నిర్వహించాల్సిన పద్ధతులపై కూడా ప్రాథమికంగా చర్చలు జరిపారు. తెలంగాణ నేలలన్నింటిలో ఒకేరకమైన లక్షణాలు లేవని, నైట్రోజన్, పాస్పరస్, జింక్, సల్ఫర్, బోరాన్ లాంటి పోషక పదార్థాల నిష్పత్తిలో కూడా చాలా వ్యత్యాసాలు వున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల ఏ నేలలో ఏ పోషకం తక్కువున్నదో తెలుస్తుందని, దానివల్ల ఆ భూముల్లో ఆ పోషకం పెంచడానికి అవసరమైన ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుని భూసారాన్ని పెంచుకోవచ్చని చెప్పారు. ఇలా చేయడం వల్ల దిగుబడులు కూడా పెరుగుతాయని ముఖ్యమంత్రి అన్నారు. మొత్తం తెలంగాణ వ్యాప్తంగా భూసార పటం తయారు చేసుకోవడం వల్ల క్రాప్ కాలనీల విభజన, నిర్వహణ కూడా సులభం అవుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. భూసారాన్ని గుర్తించడానికి భూసార పరీక్షలకు మించిన మార్గం లేదని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. భూసార పరీక్షలు నిర్వహించుకున్న తర్వాత పంటలను ఎంచుకుని సాగు చేయడం వల్ల కర్ణాటకలో రైతులు దిగుబడిని 32 శాతం నుండి 66 శాతం వరకు పెంచుకోగలిగారని, దీన్ని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో కూడా భూసార పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. నీటి లభ్యత తక్కువగా వున్న నేలల్లో కూడా వ్యవసాయం చేయవచ్చని, అక్కడి భూముల్లో కూడా ఏలాంటి లక్షణాలు వున్నాయో తెలుసుకుని పంటలను

ఎంపిక చేసుకోవడం వీలవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. భూసార పటాన్ని రూపొందించుకున్న తర్వాత ఆ సమాచారం అందరికి అందుబాటులో పెడతామని, ప్రతి రైతుకు తన నేల స్వభావం ఏమిటో స్పష్టంగా తెలిపేందుకు సాయిల్ హెల్త్ కార్డులు ఇస్తామని వెల్లడించారు. ఇది సాంప్రదాయ వ్యవసాయం చేసే రైతులకే కాకుండా కూరగాయలు, పండ్లతోటలు, పూలమొక్కలు, ఔషధ మొక్కలు పెంచే వారికి కూడా ఉపయోగకరంగా వుంటుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ముందే భూసార పరీక్షలు నిర్వహించుకోవడం వల్ల ఆ నేలల్లో పండించే పంటలకు ఏలాంటి తెగుళ్లు వస్తాయో కూడా ఓ అంచనాకు రావచ్చని దీనివల్ల ముందు జాగ్రత్తలు తీసుకోవడం తేలిక అవుతుందని సిఎం చెప్పారు. అన్ని విధాల భూసార పరీక్షలు అత్యంత అవసరం కాబట్టీ వీలైనంత తొందరగా ఈ కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. భూసార పటం రైతలకే కాకుండా ప్రభుత్వానికి, వ్యవసాయ పరిశోధకులకు, వ్యవసాయ అధికారులకు, సంప్రదాయ ఎరువుల ఉత్పత్తి దారులకు, చివరికి వ్యవసాయ విధానాన్ని ఖరారు చేసే శాసనకర్తలకు కూడా కరదీపికలా పనిచేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం